క్లుప్తంగా

విమ్స్‌లో కొనసాగుతున్న సదరం క్యాంప్


విమ్స్‌లో సదరం క్యాంప్‌నకు హాజరైన దివ్యాంగులు

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించే సదరం క్యాంప్ కొనసాగుతోంది. మంగళవారం నిర్వహించిన క్యాంప్‌లో 30 మందికి ఆర్థోపెడిక్ వైద్యులు పరీక్షలు జరిపారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పర్యవేక్షణలో ఈ క్యాంప్ ఇక్కడ నాలుగు వారాలుగా నిర్వహిస్తున్నారు. ప్రతీ మంగళవారం సదరం క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ సుమారు 120 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించినట్లు డైరెక్టర్ రాంబాబు తెలిపారు. విమ్స్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో దివ్యాంగులకు మాత్రమే సదరం క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

సత్యసాయి జయంతికి రైళ్లు నడపాలని వినతి


ప్రత్యేక రైళ్లు నడపాలని డీఆర్‌ఎమ్‌ను కోరుతున్న ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ : శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో విశాఖ నుంచి పుట్టపర్తికి ప్రత్యేక రైళ్లు నడపాలని జిల్లా సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు రైల్వే డీఆర్ఎం లలిత్ బోహ్రాను కోరారు. ఈ మేరకు మంగళవారం సంస్థ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లతోపాటు ప్రస్తుతం ఉన్న రైళ్లకు అదనపు బోగీల సౌకర్యం కల్పించాలని కోరారు. విశాఖ నుంచి బాబా వారి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు అవకాశం ఉన్న భక్తుల సంఖ్యను వివరించారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'గురువులకు వందనం' నేడు

మద్దిలపాలెం : విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో గురుపౌర్ణమి సందర్భంగా 'గురువులకు వందనం' సాంస్కృతిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు కన్నం వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో మల్లిశెట్టి ఉషకు జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నామని తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, నగరంలోని కూచిపూడి, భరతనాట్య శిక్షణ కేంద్రాల గురువులను ఘనంగా సత్కరించనున్నామని తెలిపారు.

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ రామలక్ష్మి

ఎంవీపీ కాలనీ : తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డలు ఇద్దరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ రామలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 19వ వార్డు అప్పుఘర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వందల మంది గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ రామలక్ష్మి మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేష్టమైనవన్నారు. 6 నెలల నుంచి 2 సంవత్సరాల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా ప్రతీ తల్లి వారి బిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేసినట్లు అవుతుందన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థ సేవలు వినియోగించుకుంటూ గర్భిణులు, బాలింతలు వారితోపాటు వారి బిడ్డల ఆరోగ్యానికి కృషి చేయాలని సూచించారు. డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రమ్య, డాక్టర్ చరణ్‌సాయి మాట్లాడుతూ ప్రతీ తల్లి బిడ్డకు పాలిచ్చే సమయంలో ఒత్తిడి వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి, ఐసీడీఎస్ సీడీపీవో కె.నీలిమ, ఏసీడీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్.. గోతులమయం


హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు

- హనుమంతవాక నుంచి అడవివరం వరకు అధ్వానంగా రోడ్డు
- విశాలమైన రోడ్డుపై గోతులతో నిత్యం ప్రమాదాలు
- హెల్త్‌సిటీకి వచ్చే రోగులు, స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు


హనుమంతవాక కూడలిలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద రోడ్డుపై గోతులు


విమ్స్ గేటు - సంజయ్‌గాంధీ కాలనీ మధ్య చిత్తడిగా మారిన సర్వీస్ రోడ్డు


హెల్త్ సిటీ వద్ద గోతులు పడిన రోడ్డు

ఆరిలోవ : హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు గోతులమయమైంది. ఎక్కడపడితే అక్కడ గోతులు కావడంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 15 సంవత్సరాల క్రితం హనుమంతవాక నుంచి పైనాపిల్ కాలనీ వరకు ఐదు లైన్‌లు, పైనాపిల్‌కాలనీ నుంచి అడవివరం వరకు మూడు లైన్‌ల రోడ్డు నిర్మించారు. గత ఏడాది అడవివరం నుంచి సింహాచలం పాత గోశాల వరకు మూడు లైన్‌ల బీఆర్‌టీఎస్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న ఈ రోడ్డు పలుచోట్ల గోతులమయమైంది. సుమారు ఏడాది నుంచి ఈ గోతులు వాహనచోదకులకు ఇబ్బందిగా మారాయి. ఆయాచోట్ల వాహనచోదకులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. విశాలమైన ఈ రోడ్డుపై రద్దీలేని సమయంలో బైక్‌పై కొద్దిపాటి వేగంతో వెళ్లినా గోతులుపడిన చోట్ల ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు యువకులు పైనాపిల్‌కాలనీ నుంచి బైక్‌పై హనుమంతవాక వైపు వెళ్తూ రామకృష్ణాపురం వద్ద గోతుల్లో పడడంతో బైక్ డివైడర్‌ను ఢీకొట్టినట్లు తెలిసింది. ఆ ప్రమాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. బీఆర్‌టీఎస్‌లో ప్రజలకు ఇంతటి సమస్యలు ఎదురవుతున్నా కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా సౌకర్యాల కల్పనలో భాగమైన రహదారులపై దృష్టి పెట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డుకు కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ప్రజాప్రతినిధులను, జీవీఎంసీ అధికారులను స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.


పైనాపిల్‌కాలనీ వద్ద గోతుల రోడ్డు

ఎక్కడికక్కడ రోడ్డు శిథిలమవడంతో...

- హనుమంతవాక కూడలి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రోడ్డు గోతులమయమై కాలువ మాదిరిగా మారింది. ఇక్కడ అసలే ఇరుకు లైన్, ఆ లైన్‌లో రోడ్డు గోతులు పడడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనచోదకులు ఇక్కడ తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు.
- విమ్స్ బీఆర్‌టీఎస్ ద్వారం నుంచి సంజయ్‌గాంధీ కాలనీ మీదుగా పెదగదిలి వరకు సర్వీస్ రోడ్డు పూర్తిగా పెక్కులు తేలిపోయాయి. మధ్యమధ్యలో గోతులు పడ్డాయి. సుమారు ఏడాదిగా ఇక్కడ రోడ్డు శిథిలమైనా అధికారులు పట్టించుకోలేదు. గోపాలపట్నం, సింహాచలం, ఆరిలోవ ప్రాంతాల నుంచి ఈ రోడ్డుపైనే రోగులను తీసుకొని వారి బంధువులు విమ్స్‌కు రాకపోకలు జరుపుతుంటారు.
- హెల్త్‌సిటీ రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి, క్యూ - 1 ఆస్పత్రి వద్ద రోడ్డు గోతులుపడింది. హెల్త్ సిటీకి వెళ్తున్న రోగులు ఇక్కడ ఇబ్బంది పడుతున్నారు.
- రామకృష్ణాపురం కూడలి వద్ద రెండు లైన్లలో గోతులుపడ్డాయి. ఈ లైన్ వద్ద నాలుగు రోజుల క్రితం పైనాపిల్‌కాలనీ నుంచి హనుమంతవాక వైపు ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తుండగా గోతుల వద్ద ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఓ యువకుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.
- పైనాపిల్‌కాలనీ కూడలి వద్ద రెండు లైన్‌లలో రోడ్డుపై గోతులు పడ్డాయి. ఇక్కడ వాహనాలు ఎగిరిపోతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.
- పైనాపిల్‌కాలనీ సమీప ధారపాలెం వద్ద రోడ్డుపై గోతులుపడి పెక్క తేలిపోయింది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


రామకృష్ణాపురం కూడలి వద్ద గోతుల రోడ్డు

బాలల హక్కుల పరిరక్షణకు వివరాలివ్వండి

ఎంవీపీ కాలనీ : బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు 1098 నంబర్‌కు వివరాలు పంపించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ రామలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాలల పట్ల హింసాత్మక ఘటనలు, బాల కార్మిక వ్యవస్థ, భిక్షాటన, బాలల అక్రమ రవాణా వంటి అంశాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. దీంతోపాటు జిల్లా, నగర పరిధిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బాలల సంరక్షణ గృహాలు, సంస్థలు ఉంటే సమాచారం అందించాలని సూచించారు.

ఘనంగా కనకమాంబ పండగ


అమ్మవారికి పూజలు చేస్తున్న కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం : పాత వెంకోజీపాలెంలోని కనకమాంబ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు తెల్లవారుజాము 4 గంటలకు తమ ఇళ్ల నుంచి కళశాలతో నీటిని తీసుకొచ్చి, పురవీధుల్లో ఊరేగించిన తర్వాత అమ్మవారికి నీలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత సంఘం కార్యవర్గ సభ్యులు అమ్మవారికి తొలి పూజ నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనివార్య కారణాల వల్ల పండగ వైభవంగా నిర్వహించలేకపోయామని సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు తెలిపారు. ఏటా మాదిరిగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను శ్రీ సీతారామసేవా సంఘం, శ్రీ శెట్టిబలిజ సేవా సంఘాల మహిళలు, గ్రామస్తులు అమ్మవారికి సమర్పించి, పూజలు చేశారని తెలిపారు.

తీరంలో మందుబాబుల హల్‌చల్


యోగా విలేజ్ వద్ద మద్యం సీసా


పోలీస్ మెస్ చేరువలో మద్యం సీసా

- ఎక్కడికక్కడ తాగిపడేసిన మద్యం సీసాలు
- వాకర్స్, పర్యాటకులకు తప్పని ఇబ్బందులు

ఏయూ క్యాంపస్ : సాగర తీరం రాత్రివేళల్లో మద్యం ప్రియులకు నిలయంగా మారిపోతోంది. రాత్రి పది గంటలు దాటితే బీచ్‌లో జన సంచారం మెల్లగా తగ్గిపోతుంది. దీంతో మందుబాబులు ఆ సమయంలో సాగర తీరంలో మందు పార్టీలు చేసుకోవడానికి అనువుగా మార్చుకుంటున్నారు. తీరంలోని ఇసుక తిన్నెలపైన, విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద, యోగా విలేజ్, పోలీస్ మెస్ ఎదురుగా ఉన్న లాన్‌లలో రాత్రివేళల్లో మద్యం సేవిస్తున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కి వచ్చేవారికి మందుబాబులు తాగి పడేసిన సీసాలు, తిని పడేసిన భోజనం కవర్లు దర్శనమిస్తున్నాయి. నిత్యం వేలాది మంది పర్యాటకులు, నగరవాసులు సంచరించే, అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతాలను మందు బాబులు అడ్డాగా మార్చుకుంటున్నారంటే నగరంలో శాంతి భద్రతల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసుల పర్యవేక్షణ లోపం, తగినంత స్థాయిలో విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు లేని కారణంగా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని నగరవాసులు అంటున్నారు. తీరంలో ఇటువంటి చర్యల ఫలితంగా నగరానికి చెడ్డపేరు వచ్చే పరిస్థితి ఉంది. మద్యం సేవించిన వారు ఎవరిపైనైనా దాడి చేసినా, అఘాయిత్యాలకు పాల్పడినా సమస్య పెద్దదయ్యే అవకాశం ఉంది. ఇటువంటి వాటికి ఆదిలోనే అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

రాత్రివేళల్లో భద్రతా సిబ్బందిని పెంచడం, సాగరతీరంలో, లాన్‌లలో మరిన్ని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించాలి. అదేవిధంగా మందు బాబులను కట్టడి చేసేందుకు వారు మద్యం సేవించే ప్రాంతాలపై పోలీసులు ఆధునిక డ్రోన్‌ల సహాయంతో పహారా నిర్వహించడం అవసరమని నగరవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నగర ప్రతిష్టను పెంచే విధంగా పోలీసు, ప్రభుత్వ అధికారులు ప్రణాళికతో పని చేయాల్సిన అవసరం ఉంది.

కూటమి పాలనలో దోపిడీ పెరిగిపోయింది

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


పదమూడో వార్డులో మహిళకు కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త మొల్లి అప్పారావు


తొమ్మిదో వార్డులో కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్ స్వాతి

ఆరిలోవ : రాష్ట్రంలో కూటమి పాలనలో దోపిడీ పెరిగిపోయిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ తొమ్మిది, పన్నెండు, పదమూడో వార్డుల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి కూటమి పాలనలో జరుగుతున్న మోసాలు, కుట్రలతో కూడిన పాలన గురించి ప్రజలకు వివరించారు. యువకులు, వృద్ధులు, వ్యాపారులతో మాట్లాడి గత వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన మేలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఇసుక స్కామ్, మట్టి దోపిడీ పెరిగిపోయాయన్నారు. ఊరూ పేరూ లేని కంపెనీలకు ఇసుక కాంట్రాక్టులు ఇచ్చి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందించారన్నారు. ఖజానాకు లాభం చేకూరే విధంగా చర్యలు చేపట్టారన్నారు.

- తొమ్మిదో వార్డులో కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతితో కలిసి మొల్లి అప్పారావు హనుమంతవాకలో ఇంటింటికీ వెళ్లారు. పార్టీ వార్డు అధ్యక్షుడు నీరజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి దాస్, వార్డు పరిశీలకుడు రవికిరణ్, రవికిరణ్ రెడ్డి, సత్యవాణి, చిన్నప్పారావు, పిట్టా రెడ్డి, బుజ్జి, భీమారావు తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి పెదగదిలిలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి మొల్లి అప్పారావు గడప గడపకు, షాపులకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రీజినల్ అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, మొల్లి హేమంత్, కనకరాజు, సత్తి మందారెడ్డి, మువ్వల శ్రీను, సారిపల్లి శ్రీను, అప్పలరాజు, గోవిందమ్మ, బంధం శ్రీను పాల్గొన్నారు.
- పదమూడో వార్డులో మొల్లి అప్పారావు, వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, పార్టీ నాయకులు కలిసి శివాజీనగర్‌లో గడప గడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి పాలనలో చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం రీజినల్ అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, గూడపాటి విక్టర్, వాసు, సాగరిక, శ్రీనివాస్ పాత్రో, బేగం, వనం వరలక్ష్మి, దుర్గారావు, కనకరాజు, సురేష్, దేవి, కొండమ్మ, పోలారావు పాల్గొన్నారు.

గడప గడపకూ చంద్రబాబు మోసాలు


కరపత్రాలతో 23వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు


కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, నాయకులు


28వ వార్డులో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న పల్లా దుర్గారావు

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్‌లోని 240, 248 బూత్‌ల పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బుస రమణ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. కరపత్రంలో ఉన్న లోగోను స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన మోసాలు వివరంగా తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పులగం సూర్యనారాయణ, రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి, పులగం కొండా రెడ్డి, కొయ్య శశికళ, నగిరెడ్ల పోలిశెట్టి, ఏరుసు అరుణ, బోయి రమణ రెడ్డి, బోయి త్రినాథ్ రెడ్డి, గుమ్మిడి మణి, గూడే శ్రీనివాసరావు, బోర రాము రెడ్డి, కారపురెడ్డి దుర్గా శ్రీనివాస్, కవురు సుజాత, పిడింట్ల నర్సింగ్‌రావు, కేవీ రమణ, పిట్టా జగదీష్ రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, సీరావు రామలక్ష్మి, కొణిసి సూర్యనారాయణ, సీరపు రామలక్ష్మి, పుట్ట రమణమ్మ, బోర రాము రెడ్డి, సరగడ రమణమ్మ, ఏరుసు మంగ, చిల్లా ఎల్లయ్య రెడ్డి, సాల చిన్ని, అచ్చి సుధీర్ రెడ్డి, చిల్లా నారాయణరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలోని 225వ నంబరు బూత్ పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు చేసిన మోసాలను పొందుపరిచిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. చంద్రబాబు మోసాలు సవివరంగా వివరించి చైతన్యపరిచారు. వార్డు మహిళా విభాగం అధ్యక్షురాలు వంకర శశికళ, పీతల మహేష్, కుధా భాష, శ్యామ్, చంద్రరావు, అన్నపూర్ణ, నిట్ట వెంకట్రావు, నీలపు మురళి, రాజు పాల్గొన్నారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ మోసాలు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్‌లోని 195, 196వ నంబరు బూత్‌ల పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ బూత్ అధ్యక్షులు కొండ్రు అప్పారావు, అడపాక మునీంద్రనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. గత ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు, అరాచకాలు వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపాక శ్రీను, సంపంగి సురేష్, మామిడిపాక మహేష్, కోన కామేష్, చట్టి చిన్న, సోమదుల అప్పలరాజు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యంతో ఆటో డ్రైవర్లకు నష్టం

సీతంపేట : రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ఆటో డ్రైవర్లను ఆందోళనకు గురిచేస్తోందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం గురుద్వారా కూడలిలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల ఆటో, వ్యాన్, జీపు, కారు డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా ఆటో నడిపినా పూట గడవడం కష్టంగా ఉందన్నారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడంపై పునరాలోచన చెయ్యాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మూలకు చేరిన వ్యాయామ పరికరాలు


విరిగిపోయిన వ్యాయామ పరికరం


నిరుపయోగంగా మారిన వ్యాయామ పరికరం

ఏయూ క్యాంపస్ : ప్రజల ఆరోగ్యం కోసం సాగర తీరంలో గతంలో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు మూలకు చేరుతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు వ్యాయామం చేయడానికి వీలుగా ఓపెన్ జిమ్ తరహాలో వీటిని ఏర్పాటు చేశారు. బీచ్ రోడ్డులోని యోగా విలేజ్ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో పలు పరికరాలు మూలకు చేరాయి. వీటికి మరమ్మతులు చేయించడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. నిత్యం అనేక మంది ఈ ప్రాంగణంలో వ్యాయామం చేయడానికి వస్తుంటారు. అయితే ఇక్కడ ఉన్న కొద్దిపాటి పరికరాల్లో కొన్ని నిరుపయోగంగా మారగా, మరికొన్ని విరిగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వీటిని తొలగించి, కొత్తవాటిని ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

28 నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఎఫ్‌డీపీ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై వారం రోజులపాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నామని ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఎఫ్‌డీపీ నిర్వహించనున్నామని వీసీ పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ సిస్టం ఇంజినీరింగ్ విభాగ సమావేశ మందిరంలో దీనిని నిర్వహిస్తామని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో బోధనా సిబ్బంది, పరిశోధకులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రంగంలో అధ్యాపకుల నైపుణ్యాలను మరింత పెంపొందించడం, వర్తమాన సమాజ అవసరాలు, సమస్యలకు పరిష్కారాలు అన్వేషించే దిశగా పనిచేయడంపై శిక్షణ ఇస్తామన్నారు. ఎఫ్‌డీపీకి ఐఐటీ ఆచార్యులు, ఎన్ఐఎస్ఈఆర్ భువనేశ్వర్‌కు చెందిన శాస్త్రవేత్తలు, విభిన్న పరిశ్రమల నిపుణులు పాల్గొని శిక్షణ అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, కార్యక్రమాల కన్వీనర్ కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.